
వరిగొండ కాంతారావు
కథా సంపుటి

# కృష్ణార్పణం

కథానికా సంపుటి


| | | పుట సంఖ్య |
|---|---|---|
| 1. | ఇదండీ దీపావళి! | 1 |
| 2. | క్షమ | 5 |
| 3. | సంసారం | 18 |
| 4. | అవ్యక్తం | 26 |
| 5. | దృక్కోణం | 41 |
| 6. | గయాశ్రాద్ధం | 55 |
| 7. | అభిమానం | 64 |
| 8. | సుబ్బులు మామయ్య | 75 |
| 9. | అంతిమం | 113 |
| 10. | కృష్ణార్పణం | 129 |

# ఇదండీ దీపావళి!

**కృ**ష్ణా ది కింగ్ ముసుగు తన్ని నిద్రపోతున్నాడు. ఫిల్టర్ కాఫీతో సరిసాటి అయిన ఇన్‌స్టెంటు కాఫీని అప్పటికే రెండుసార్లు తాగేసి – మొగుణ్ణి నిద్దట్లోంచి మెళకువలోకి కుదిపింది సత్యా ది క్వీన్. ‘లేపకు సత్యా డియర్’ అంటూ అటు తిరిగి పడుకున్నాడు కృష్ణా ది కింగ్.

మళ్ళీ ఓసారి కాఫీ తాగుదామనుకొంది సత్యా ది క్వీన్. కాని ఫ్లాస్కులో ఇంకొక కప్పు మాత్రమే కాఫీ ఉంది. తనకి కాఫీ కలపడం రాదు. ఉన్న ఏడుగురు పరిచారికల్ని సవతుల ఇళ్ళ గూఢచారిత్వం కోసం పంపి గంటయింది. ఇంకో గంటకి గాని వాళ్ళు రారు.

ఏమీ తోచడం లేదు. హఠాత్తుగా గుర్తుకువచ్చింది. కృష్ణుడి అపాయింటుమెంటు డైరీ తీసి చూసింది. ఇవాళ నరకాసురుడితో యుద్ధం.

అబ్బ యుద్ధాల గురించి వినింది. కాని కళ్ళారా కనలేదు. ఇవాళ ఈయనతో వెడితే సరి.

మళ్ళీ మొగుణ్ణి లేపింది. ‘బారెడు పొద్దెక్కింది. రాత్రంతా నిద్ర సరిపోలేదా!’ విసుక్కొంది మొగుణ్ణి.

‘‘ఎనిమిదిళ్ళూ తిరిగేసరికి తెల్లారింది. ఇంకెక్కడి నిద్ర’’ ఒళ్ళు విరుచుకుంటూ అన్నాడు కృష్ణుడు.

‘ఇవాళ నరకుడితో యుద్ధం. ఆ లక్షణాలేవీ మీలో కనపడడం లేదు” అంది మొగుడికి పేస్టునందిస్తూ సత్యా ది క్వీన్.

‘మనం యుద్ధానికి వెళ్ళడమేంటి? ఎవడైనామనపైకి వస్తే చంపుతాం!’ అంటూ బాత్రూంలోకి దూరాడు కృష్ణా ది కింగ్.

మొహం తుడుచుకుంటూ బయటికొచ్చిన మొగుడికి ఫ్లాస్కులో కాఫీ వంచి ఇచ్చింది సత్యా ది క్వీన్.

'మీ అపాయింటుమెంటు డైరీ చూసే చెప్పాను' అంది క్వీన్.

'ఇదేమన్నా విందా వినోదమా ! అపాయింటుమెంటుండానికి' అన్నాడు ది కింగ్.

"'ఏమో ఎవడికి తెలుసు మీరు జాంబవంతుడికి మల్లయుద్ధం అపాయింటుమెంటు త్రేతాయుగంలో ఇచ్చారు. ఇది ఏ కృతయుగంలో ఇచ్చారో. అయినా 'కరణేషు మంత్రి' అంటారుగదాని చెప్పాను". ఉక్రోషంగా అంది సత్య

"సర్లే! యుద్ధమే గదా వెళదాంలే! మల్లయుద్ధం అపాయింట్‌మెంటు నీ కాలు తాపువరకూ వచ్చింది."

'జాంబవతినీ తెచ్చిందిగదా !' అందామనుకొంది. కాని తన పని వేరు గదా ! అందుకని 'వెళదాంలే అంటున్నారు నన్ను కూడా తీసుకెళతారా!' అడిగింది సత్య.

"యుద్ధానికి స్త్రీలు రారు" అన్నాడు కృష్ణుడు.

"త్రేతాయుగంలో కైక వచ్చింది".

"అందుకే దశరథుడు చచ్చాడు."

"కైక లేకపోతే దశరథుడు యుద్ధంలోనే చచ్చేవాడు". రిటార్టిచ్చింది సత్య.

'నీవు రాక తప్పదా!' ఓడిపోతూ అడిగాడు కృష్ణుడు.

'తప్పదు' అంది సత్య!

"సరే గరుత్మంతుడికి ఎస్‌టిడి కొట్టి రమ్మని చెప్పు" అన్నాడు కృష్ణుడు

"ఎస్‌టిడి లైన్లు బాలేవు" ట్రై చేసి చెప్పింది సత్య.

"యుద్ధం మానేద్దాం!" అన్నాడు కృష్ణుడు

"ఎందుకని" – సత్య.

"అమావాస్య ముందర చతుర్దశి మంచిది కాదు"

"సూర్యమానం ప్రకారం అమావాస్య మంచిదే"

"మనది బార్హస్పత్యమానం"

# సంసారం

"మామిడికాయ పప్పు బాగుంది" భోంచేస్తూ అన్నాడు వేణు.

"ఎదురింటి ఆంటీ రెండు కాయలిచ్చింది. వాళ్ళ దొడ్లో కాయలు దింపించారు ఇవాళ" చెప్పింది రమాసుందరి భర్తకు మరికాస్త పప్పు వడ్డిస్తూ.

భోజనాలు పూర్తయ్యాయి. వేణు ఏవో ఆఫీసు కాయితాలు చూచుకుంటున్నాడు. వంటిల్లు సర్దుకుంటూ ఆలోచనల్లో పడిపోయింది రమాసుందరి.

నగర శివార్లలో వెలుస్తూన్న అనేకానేక కాలనీల్లో మిత్రబంధనగరం ఒకటి. వేణూ రమాసుందరీ ఇటీవలే అంటే ఓ మూణ్ణెల్ల క్రితం ఈ కాలనీకి మారారు. అదివరకు పాతబస్తీలోనే ఇంటి మీద ఇల్లుండే ప్రాంతంలో అద్దెకుండే వారు. మురుక్కాలవలూ, నీటి ఎద్దడీ, జలయుద్ధాలూ, వాహనాల రొద, గతుకుల రోడ్లూ కాపురానికొచ్చిన కొత్తలో భరించలేకపోయినా – మొగుడి కోసమని సర్దిచెప్పుకొని సర్దుకుపోయింది రమాసుందరి.

తూర్పున గోదావరీ, పడమర దట్టమైన అడవీ, మధ్యలో పచ్చికబయళ్ళూ, పొలాలూ, చిన్న చిన్న ఊళ్ళూ, విసిరేసినట్టుగా ఊరికి దూరంగా అక్కడక్కడా పొలాల మధ్య కట్టుకున్న ఇళ్ళూ, పశువులూ, అప్పుడప్పుడూ దర్శనమిచ్చే వన్యమృగాలూ– ఇదీ రమాసుందరి పుట్టి పెరిగిన వాతావరణం. వాళ్ళది గోవుల పల్లె.

ఆ పల్లెలో బడీ బండలూ అంటూ లేదు. శాంతయ్య పంతులు అని పురోహితుడుండేవాడు. వయస్సు యాభైపైనే. అతడిది ఏడూళ్ళ పౌరోహిత్యం. పనిని బట్టి ఏడూళ్ళూ సైకిలు మీద తిరుగుతుండేవాడు. అన్నీ బానే ఉన్నా అతడికి సంతానం లేదు. ఊళ్ళో పిల్లలందర్నీ తమ పిల్లలుగానే భావించే వారా దంపతులు. పొరుగూరికి వెళ్ళే పనిలేని రోజున ఊరి పిల్లలందర్నీ పోగేసుకొచ్చి ఇంటి వరండలో కూర్చోబెట్టుకొని తనకొచ్చిన విద్యని తనకు నచ్చిన రీతిలో – ఎర్రని ఏగానీ తీసుకోకుండా దానం చేసేవాడు. ఓ రోజొచ్చిన పిల్లాడు ఇంకో

రోజు రాడు. ఒక్కోరోజున పట్టుమని పదిమంది కూడా రారు. ఇంకోరోజున ఊరిపిల్లల్తో పాటు వాళ్ళిళ్ళకొచ్చిన చుట్టాల పిల్లల్తో కలిపి పాతిక ముప్పైమంది వరకూ వచ్చేవారు. వరండా సరిపోకపోతే ఇంటిముందరి వేప చెట్టు నీడ బడిగా మారిపోయేది. పిల్లలక్కావలసిన పలకలూ, బలపాలూ, పుస్తకాలూ, పెన్సిళ్ళూ – తన ఖర్చు మీదే పట్నం వెళ్ళే వాళ్ళ ద్వారా తెప్పించి ఇచ్చేవాడు శాంతయ్య.

శాంతయ్య భార్య రమణమ్మ భర్తకు తగిన భార్య. చదువుకోడానికొచ్చిన పిల్లలకి రోజూ ఏదో ఒక తాయిలం చేసిపెట్టేది. సగమ్మంది పిల్లలు శాంతయ్య చెప్పే చదువుకన్నా రమణమ్మగారు పెట్టే తాయిలాల మీద ప్రేమతోటే వచ్చేవాళ్ళు. పాఠం పూర్తయితేగాని ఆవిడ తాయిలంపెట్టదు. తాయిలం కోసమైనా చచ్చినట్లు పాఠం వినేవాళ్ళు పిల్లలు.

ఊరివాళ్ళు కూడా తమ పిల్లలకు పంతులు ఉచితంగా చదువు చెప్పడం ఇష్టం లేని కారణంగా – కాలాన్ని బట్టి కూరగాయలో ఆకుకూరలో, కాయలో పళ్ళో, కందులు, పెసలు వంటి ధాన్యాలో పిల్లల చేత అయ్యవారికి పంపించే వారు.

అదిగో ఆ శాంతయ్య గారి దగ్గర ఓం నమ:తో మొదలైంది రమా సుందరి చదువు. యాభై ఆరు అక్షరాలూ, గుణింతాలు, ప్రతి అక్షరానికి ఇంకో అక్షరం ఒత్తుగా పెట్టిరాయడం, నూరంకెల వరకు నేర్వడం ఇత్యాదులన్నీ పలకమీద బలపంతో దిద్దుకొని నేర్చుకొంది. ఇరవై ఎక్కాల్ని ప్రతి ఎక్కమూ ఇరవై అంకెలవరకూ వరుసగానూ తల్లక్రిందులుగానూ అప్పజెప్పడం నేర్చుకొంది. ఆపైన వారాలు, తిథులు, నెలలు, ఋతువులు, అయనాల పేర్లూ, ప్రభవాది అరవై సంవత్సరాల పేర్లూ, ఇరవై ఏడు నక్షత్రాల పేర్లూ, నవగ్రహాల పేర్లు, పన్నెండు రాశుల పేర్లూ కంఠోపాఠంగా అప్పజెప్పడం మొదలుపెట్టింది. తెలుగు నెలలూ వారాలతో పాటు ఇంగ్లీషు నెల వారాల పేర్లూ నేర్చేసుకుంది రమా సుందరి. ఇవికాక రాష్ట్రాల పేర్లూ, దేశాలూ, ఖండాలూ, మహాసముద్రాల పేర్లు కూడా అప్పజెప్పగలుగుతోంది.

గోవులపల్లెకు రెండు మైళ్ళవతలవున్న సాధనపల్లెలో జిల్లాపరిషత్తు మాధ్యమిక పాఠశాల ఉండింది. రమాసుందరిని ఆ బడికి పంపించమని శాంతయ్య గారి సిఫారసు. ఆడపిల్ల కంత చదువెందుకని రమాసుందరి తండ్రి

# దృక్కోణం

**మ**న ఎదురింట్లోకి ఎవరో అద్దెకొచ్చారండి. మధ్యాహ్నం భోజనాలు చేసేప్పుడు చెప్పింది వారిజ భర్త లక్ష్మీనారాయణతో.

"పోనీలే నీక్కాస్త కాలక్షేపంగా ఉంటుంది. ఇంతకీ ఎవర్ట? వాళ్ళదేవూర్ట?" అడిగాడు లక్ష్మీనారాయణ.

"ఏదీ గంట క్రితం డి.సి.యం.లో సామాను దించి మళ్ళీ తాళం పెట్టుకు వెళ్ళారు. ఆడవాళ్ళెవరూ రాలేదు. మళ్ళీ ఇంకో ట్రిప్పు సామానొస్తుందో – లేక మనుషులు విడిగా రాత్రికి వస్తారో తెలీదు. ఎవరో పెద్దాయన మాత్రం వచ్చాడు." సమాధానం చెప్పింది వారిజ.

"ఎవరన్నా విద్యార్థుల కద్దె కిచ్చారేమో! అందుకు ఆడవాళ్ళు వచ్చి ఉండరు". అన్నాడు లక్ష్మీనారాయణ.

"దిగిన సామానుని బట్టి ఆడవాళ్ళు కచ్చితంగా ఉండాలి". స్థిరంగా చెప్పింది వారిజ.

వారిజ లక్ష్మీనారాయణలు కొత్త దంపతులు. అంతా వాళ్ళ పెళ్ళయి పదినెలలు కావస్తున్నదేమో! ఊరికి దూరంగా ఉన్న విసిరేసిన కాలనీలో ఉంది వాళ్ళ యిల్లు. లక్ష్మీనారాయణ తండ్రి రామచంద్రయ్యగారు ఉపాధ్యాయునిగా పనిచేసి విశ్రాంతులయ్యారు. అప్పుడెప్పుడో యన్టీ రామారావు ముఖ్యమంత్రిగా ఉండగా ఉపాధ్యాయుల జీతాలు ఒక్కసారిగా పెంచినప్పుడు వచ్చిన బకాయిలతో ఓ మూడొందల గజాల స్థలం ఊరికి విసిరేసినట్లుగా ఉన్న పొలాల మధ్యన కొన్నాడు. ఆ తర్వాత వచ్చిన రిటైర్మెంటు డబ్బుల్తో ఓ నాలుగ్గదుల ఇల్లుకట్టాడు. కూతురి పెళ్ళీ కూడా చేశాడు. ఇళ్ళు అక్కడొకటి ఇక్కడొకటి విసిరేసినట్లుగా ఉండడంతో ఆ కాలనీకి విసిరేసిన కాలనీ అన్నపేరు స్థిరపడిపోయింది.

వారిజ కాపురానికొచ్చినపుడు అత్తమామలిక్కడే ఉన్నారు. ఎప్పుడూ ఎవరో ఒకరు బంధువులో మిత్రులో వచ్చిపోతూండడం మూలాన వారిజకి ఒంటరిగా ఉన్నామన్న భావన కలిగేది కాదు. లక్ష్మీనారాయణ కోర్టులో స్టెనోగ్రాఫరుగా

పనిచేస్తాడు. పొద్దున్న ఏడున్నరా ఎనిమిది గంటల కల్లా బయల్దేరి జడ్జిగారింటికి వెళ్తాడు. అక్కడ డిక్టేషన్లు తీసుకొని అట్నించటు కోర్టుకెళ్ళినవాడు మళ్ళీ రాత్రి ఎనిమిది గంటలదాకా ఇంటికి రాడు. పగలంతా భర్త కనపడకపోయినా ఇంటినిండా మనుషులుండి సందడిగా ఉన్న కారణాన, చేతినిండా పని ఉన్న కారణాన కాలం గడిచిపోయేది.

వారిజ ఆడపడుచుకి నెల తప్పింది. నెలతప్పిన వార్తతోపాటు "ఇప్పట్నించి పురిటి వరకూ బెడ్‌రెస్టు తప్పనిసరి" అని చెప్పిందిట లేడీ డాక్టరు. ఆడపడుచు అత్తమామలు వాళ్ళమ్మాయికి పురుడు పోయడానికని అమెరికా వెళ్ళారు. అక్కడ మొగుడూ పెళ్ళాలిద్దరే.

"మాకున్నది అమ్మాయి అబ్బాయి ఇద్దరేకదా! కోడలు కూడా కొత్తగా కాపురానికొచ్చింది.. అమ్మాయిని పంపించండి. ఎలాగూ తొల్చూరు పురుడు మేమే పోస్తాం కదా! "అన్నారు వీళ్ళు.

"ఇక్కడ హైదరాబాదులో ఉండే వైద్యసదుపాయాలు మీ ఊళ్ళో ఉండవుకదా! అయినా మీరుండే కాలనీ ఊరికి సంబంధంలేకుండా ఉంటుంది కదా! మీ అమ్మాయి ముఖ్యమనుకుంటే మీరొచ్చి ఉండండి. లేదంటే మా తంటాలేవో మేం పడతాం. అంతే తప్ప మీ అమ్మాయిని పంపడం ససేమిరా కుదర్దు" అన్నాడు ఆడపడుచు మొగుడు. ఇంక తప్పేదేముంది. పెద్దవాళ్ళిద్దరూ హైదరాబాదు వెళ్ళిపోయారు కోడలు ఒంటరిగా ఉంటుందని బాధపడ్తూనే.

వారిజ ఒంటరిగా ఉంటుందన్న ఉద్దేశ్యంతోనే కాస్త ఇబ్బందైనా మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చి వెడుతున్నాడు లక్ష్మీనారాయణ. సాయంకాలాలు కూడా పెందలాడే వస్తున్నాడు. అయినా అప్పుడడప్పుడూ మరీ తప్పనిసరి అయి భర్తకి కుదరనప్పుడు వారిజ ఒంటరిగానే రోజంతా బిక్కు బిక్కుమంటూ కాలం గడపాల్సి వస్తోంది.

చుట్టుపక్కల వాళ్ళతో ఇప్పుడిప్పుడే పరిచయాలేర్పడుతున్నాయి. కాని ఇంటినానుకొని ఇల్లున్న వ్యవహారం కాదు కాబట్టి - వారిజకి కాస్త భయం భయంగానే ఉంటుంది.

వారిజ కాపురానికొచ్చిన కొత్తల్లో వీళ్ళ ఎదురింట్లో ఇంటివాళ్ళే ఉండేవారు. ఆయన వాణిజ్యపన్నుల శాఖలో పనిచేస్తాడు. పదోన్నతి మీద ఆదిలాబాదుకి

# అభిమానం

"ఏందె కాక! పదిహేనిరువై దినాల సంది కన్పడ్తలెవ్వు. ఎక్కడికి పోయినవు !" అట్కాయించిండు లచ్చిరెడ్డి.

"డప్పు సత్తిగాని దినాలకు బొయ్యొచ్చిన. సావుకు మా బోయిన గని లచ్చక్కను అట్కాయించెటందుకు కుదురలె. నడుమల వీల్జూసుకోని పోతె అన్నదిగదా ! 'దినాల్దాక ఉండవా అన్నా !' అని. సరె తియ్యి అని అట్లనె ఉండిపోయిన అనుకోరాదు. నా కొడుకోడలు సుత ఆడనె ఉంటరు కాబట్కె ఉండజాలిన. లేకుంటె దినంబొయి రాబడ్తుండె". సమదానం జెప్పిండు రాంరెడ్డి.

"డప్పు సత్తిగాడంటె !" మల్లడిగిండు లచ్చిరెడ్డి.

"కొడుక నీకెన్నేండ్లుంటయిర !" ఎదురడిగిండు రాంరెడ్డి.

"నీకు తెల్వదానె ! పచ్చీసు లోపట్నె ఉంట." చెప్పిండు లచ్చిరెడ్డి.

" నివు బుట్టక ముందె వాడు ప్యాటకు బోయిండు అందుకె నీకు వాడేర్పాటు లేడు." అన్నాడు రాంరెడ్డి.

"ప్యాటంటె!" అనుమానపడుకుంట అడిగిండు లచ్చిరెడ్డి.

"ప్యాటంటె వరంగల్లు. దినాం అంగడి నడిచెదాన్ని పట్నమంటరు. వారానికోపారి అంగడి నడిస్తె ప్యాటంటరు. ఊర్లు, పల్లెలల్ల అంగడుండది. అప్పట్ల వరంగల్లుల వారానికోపారె అంగడుంటుండె. అందుకె దాన్ని ప్యాటంటం. పట్నమంటె హైదరాబాదన్నట్టు" వివరంగ చెప్పిండు రాంరెడ్డి.

" నేం బుట్టకముందు ప్యాటకు బొయినోనికి, నీకు సోపతిందాంక ఉన్నదంటె ఆయినేదొ పెద్ద కొలువుజేస్తున్న కిందికె లెక్క. ఏంజేస్తుండెనె !" ఉత్సాహంగ అడిగిండు లచ్చిరెడ్డి.

"వాని పేర్లనె తెలుస్తుండె గదర. డప్పు సత్తిగాడంటె మాదిగ డప్పుకొడ్తుండె. వాడు నేను ఒక్కటే తరగతి. సోపతిగాండ్లం. వాడు రెండోజ్జదివి బందువెట్టిండు.

నేన్నాలుగోజ్జదివిన. అప్పటికి మనూరి బల్లె నాల్గో తర్గతి దాంకనె ఉండె. సాతాని పంతులొక్కడె పాఠం చెప్తుండె.” వివరించిండు రాంరెడ్డి.

“ రెండోజ్జదివి బందుపెట్టినోన్తోని నీకిన్నేండ్ల దోస్తాన నడుస్తుందిలె” – ఆశ్చర్యపోయిండు లచ్చిరెడ్డి.

“ వారి ! నీకు కత మొత్తం చెప్తెగని సమజుగాదుగని ఇక చెప్తాన్న ఇను” అనుకుంట గతాన్ని జూసెటందుకు కండ్లు మూసుకున్నడు రాంరెడ్డి.

మా నాయినమ్మ జమాన్ల గోరంగ ఉంటుండెనట గని మా అమ్మ జమానచ్చెటాల్లకు అంటుడు ముట్టుడు ఇంటిదాకనె పరిమితం. బయట తిరిగచ్చిన బట్టలు వసారాల చిలుకొయ్యకు తలిగిచ్చి బరివాతల ఇంట్లకు బొయి వేరె బట్టలేస్కోవాలన్నట్టు. పెద్దోల్లయితె వాకిట్ల చేదబాయికాడ తానం జేసి లోపటికి బోవాలె. పోరలకు తానం మాఫన్నట్టు. నాకు పెండ్లయి మీ చిన్నమ్మ కాపురాని కచ్చేవరకు అదిసుత బొయిందనుకో !

బడి మొత్తం గలిస్తె ముప్పై నలుభైమంది పోరలం. మా తరగతి అనుకుంటె పదిమంది దన్క ఉంటం. తరగతి అంటె అర్రలాపాడా ! పంతులింటి ముందటి యాపచెట్టె మా బడి. సారు నడుమల కుర్చీపీట మీన కూసుంటడు. నాలుగు దిక్కుల నాలుగు తరగతులోల్లు కూసుంటరు. వానబడ్డ నాడు సారిల్లెబడి. అప్పుడు ఒక వరుసల కూసున్నోల్లందరు ఒక తరగతన్నట్టు.

ఈ ముప్పైనలుభైమందిల సత్తిగాన్తోని జమాయించినట్టుగ నాకింకెవన్తోని జమాయించలె. తతిమ్మోల్లెర్కలేరనిగాదు, వాల్లతోని దోస్తాన లేదన్నట్టు కాదుగని సత్తిగాడు కన్పడని దినం పొద్దు పొడువని కిందికే. వానికి సుత నన్ను జూడకుంటె అట్లనె ఉంటుండె.

బడంటె ఇప్పట్లెక్క పొద్దున్దన్క తెల్లన్దన్క సదువుడుంటుండెనా పాడా ! పొద్దు పొడిచిన జాముకు బడికి పోతె ఇంక జాము పొద్దుండగనె బడి ఇడ్సిపెడ్దురు. ఆ నడుమ సుత కొద్దిసేపు ఆటలాడుకునెదానికి ఇడ్సిపెడ్తుండిరి. పలక బలపం ఇంట్లకిసిరి కొట్టి ఆడుకోనుబొయినమంటె అమ్మ కందిలి మసి తుడుస్తుంటె వాపసస్తుంటిమి.

# సుబ్బులు మామయ్య

**సి**కిందరాబాదు స్టేషను నాలుగో నంబరు ప్లాటుఫారం కోలాహలంగా ఉంది. గుంటూరు వెళ్ళే ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రద్దీగా ఉంది. కూలీచేత సామాన్ని సీటు దగ్గర పెట్టించుకొని గుమ్మం దగ్గర కొచ్చాను. ఫ్లాట్‌ఫారమ్మీద శ్రీవారున్నారు. గుమ్మంలో నుంచునే మాట్లాడదామనుకొన్నాను. కాని ఎక్కేవాళ్ళూ దిగేవాళ్ళూ, వాళ్ళ తోపులాటలూ ఆ కారణంగా నేను కూడా ప్లాటుఫారమ్మీదకొచ్చేశాను. సాధారణ బోగీ అయితే సీట్లోనే కూర్చొని ఫ్లాటుఫారమ్మీదనున్న తనతో కిటికీలోంచి మాట్లాడేదాన్ని. అది ఎ.సి. బోగీ కావడం మూలాన ఆ సౌకర్యం లేదు.

"ప్రయాణం జాగర్త. రైలు జాగర్తగా దిగు. స్టేషనుకి మీ ఆఫీసు వాళ్ళొస్తా రన్నావుగా - జాగర్త. వాళ్ళని గుర్తుపట్టగలవుగా - జాగర్త. గెస్టుహౌజు అదీ జాగర్తగా చూసుకొని మరీ దిగు. కొత్తచోటు. ఆఫీసు పనికి దూకుడు పనికిరాదు. జాగర్తగా ఆలోచించి మాట్లాడు. నిర్ణయాలు జాగర్తగా తీసికో!" ఆయన చెబుతూనే ఉన్నారు. నేను చిరునవ్వుతో వింటున్నాను.

నేను నవ్వడాన్ని గమనించి ఆయన ఆగిపోయారు. "ఏంటి నవ్వుతాలుగా ఉందా!" కాస్త కోపంగానే అడిగారు.

"మీరిప్పుడు చెప్పిన వాక్యాల్లో ఏడు జాగర్తలున్నాయి. మీరు ఈ జాగర్తల్ని నిన్న పొద్దుట్నించీ ఐదొందల పదహారుసార్లు చెప్పారు. పై పదహారు తీసేసినా ఇప్పటికి కనీసం మూడువేల ఐదొందల జాగర్తలు చెప్పారు. ఇప్పుడు చెప్పండి. నవ్వాలా! వద్దా!" అన్నాన్నేను.

"నీకు బ్యాంకు వాళ్ళు నోట్లు లెక్కబెట్టడమే నేర్పారనుకున్నాను. మాటలు లెక్కబెట్టడం కూడా నేర్పారన్నమాట!" అన్నారు కాస్త ఉడుక్కుంటూ.

"బ్యాంకు వాళ్ళు నోట్ల లెక్కకే పరిమితమయ్యారు. మాటల లెక్క మా కామర్సు మాస్టారు దగ్గరే నేర్చుకున్నాను." అన్నాను 'కామర్సు మాస్టారు' అన్న పదాన్ని వత్తి పలుకుతూ.

ఆయన బద్రూకా కాలేజ్ ఆఫ్ కామర్స్‌లో రీడరన్న విషయాన్ని గుర్తు చేయడమే నా ఉద్దేశ్యం.

"మొత్తానికి బ్యాలన్సు షీటునిలా ట్యాలీ చేశావన్నమాట" అన్నారు తేలిగ్గా నవ్వేస్తూ.

రైలు కదుల్తుందన్నట్టుగా ఎనౌన్సు చేశారు. "ఆల్ ద బెస్ట్ రమా!" అంటూ షేక్ హ్యాండిచ్చారు శ్రీవారు. ఆ కరస్పర్శలో నన్ను విడిచి తానుండలేరన్న విషయం ద్యోతకమైంది. అరక్షణం పాటు 'ఆగిపోదామా' అనిపించింది. అంతలో ఆయనే తేరుకున్నారు.

"రైలు కదిలేలా ఉంది ఎక్కేయ్! అన్నట్టు నీ బాయ్‌ఫ్రెండు ఎక్కడున్నాడో వెతికి పట్టుకో. మధ్యలో ఎప్పుడన్నా జ్ఞాపకమొస్తే నాకు ఫోన్ చేయి" అన్నారు వెక్కిరింపుగా.

"మీకంత అసూయ అవసరం లేదు లెండి. నా బాయ్‌ఫ్రెండు చేతే మీకు ఫోన్ చేయిస్తాను" అన్నాను రైలు మెట్టు మీద కాలుపెడుతూ.

రైలు కదిలింది. కనుచూపు మేరవరకూ శ్రీవారిని చూచుకొని లోపలికి వచ్చి సీటులో కూచున్నాను.

పెళ్ళయ్యే నాటికి నేను బియస్సీ రెండో సంవత్సరంలో ఉన్నాను. 'చదువు పూర్తయ్యేదాకా పుట్టింట్లోనే ఉంటాను' అన్నషరతుకు అంగీకరించి పెళ్ళి చేసుకున్నారాయన. అప్పటికి ఆయన బద్రూకా కాలేజీలో లెక్చరరుగా చేరి ఆర్నెల్లు మాత్రమే అయింది. వారం వారం నా పుట్టిల్లయిన వరంగల్లుకి వచ్చి పోతుండేవారు. కాలేజీ సెలవుల్లో నేనే హైదరాబాదుకి వెళ్ళేదాన్ని. ఆయన సాహచర్యంలో ఐదారు నెలలు గడిచేప్పటికి నాకింక చదువుకోవాలనిపించలేదు. 'నువ్వు డిగ్రీ పూర్తి చేయాల్సిందే!' అంటూ పట్టుబట్టారు. అందుకే ఇప్పటికీ నేనంటూనే ఉంటాను 'ఈ డిగ్రీ నాది కాదు మీదే'నని.

హైదరాబాదు కాపురానికొచ్చాక ఎప్పుడు బజారుకెళ్ళినా ఎవరో ఒకరు నా క్లాస్‌మేట్సు కలుస్తుండేవారు. కారణమేమంటే పెళ్ళైన నా క్లాస్‌మేట్సందరికీ అత్తారిల్లు హైదరాబాదే. అందరూ ఏదో ఒక ఉద్యోగం చిన్నదో, పెద్దదో, ప్రైవేటుదో గవర్నమెంటుదో చేస్తూండేవారు. పైగా 'ఏమే! ఇంట్లో ఒక్కదానివీ ఒంటరిగా ఏంచేస్తావే! బోరు కొట్టదా!' అంటూ అడిగేవారు.

# కృష్ణార్పణం

**నా**రదుడు భోజనం చేసి అలా వెళ్ళిన అనంతరం రుక్మిణి కూడా భోజనం చేసి తాంబూలం సేవిస్తూ తూగుటుయ్యాల మీద ఊగుతుంటే పరిచారికలు వింజామరలు వీస్తున్నారు.

తన సదనంలో ప్రతినిత్యమూ ఎవరో ఒక ముని పుంగవుడో ఋషి పుంగవుడో భోజనం చేసి వెళితేకానీ అన్నమ్ముట్టుకోదు రుక్మిణి. ఇవాళ నారదుల వారితో కాలక్షేపం జాస్తి అయింది. భోజనాలు ఆలస్యమైనాయి. బడలికగానూ, నిద్రమత్తుగానూ ఉంది రుక్మిణికి. అయినా పగటినిద్ర పనికి చేటు అనే సామెతను మనస్ఫూర్తిగా నమ్మిన మనిషి కాబట్టి చెలికత్తెలతో కబుర్లు చెబుతూ కాలక్షేపం చేస్తోంది.

ఇంతలో గాజుల చప్పుళ్ళూ, అందెల రవళులూ, కలకల స్వనాలూ వీధి గుమ్మం వైపునుండి వినవచ్చాయి. ఎవరొచ్చారో చూడమని రుక్మిణి అనేంతలోనే అష్టమహిషుల్లో ఆరుగురు తమతమ చెలికత్తెలతో భవనప్రవేశం చేశారు. అందరూ ముక్త కంఠంతో "నమస్కారమక్కయ్యా" అనడంతో పాటు పాదాభివందనం కూడా చేశారు.

రుక్మిణికి మహదానందమైంది. ఎన్నాళ్ళైందో అందరూ ఇలా కలిసి. "సత్యభామ కూడా వస్తే బాగుండేది. లేదంటే అందరమూ కలిసి అక్కడికే వెళదాం. మనమెనమండుగురమూ ఒక్కసారిగా కలుసుకొని చాలారోజులైంది" అంది రుక్మిణి.

"రోజులు కాదక్కా! ఏళ్ళయింది. చిన్నక్క కూడా వస్తానంది. కాస్త ఆలస్యమౌతుందని చెప్పింది." అన్నది మిత్రవింద.

అందరికీ మంచినీళ్ళూ పానీయాలూ అందాయి. ఎవరూ ఏమీ మాట్లాడ్డం లేదు. అందరూ ఒకరి మొహాలు ఒకరు చూసుకుంటున్నారు.

రుక్మిణి కల్పించుకొని అడిగింది "ఏమర్రా ఎవరూ మాట్లాడరు. ఏదైనా పనిమీద వచ్చారా!."

"అవునక్కా!" కాస్త విరామం తరువాత ధైర్యం చేసి చెప్పింది జాంబవతి. "ఇంకా రెండు రోజుల్లో నరకచతుర్దశి, దీపావళి రాబోతున్నాయి కదా! ఈ సారి దీపావళి మనమందరమూ కలిసి ఒకేచోట అంటే నీ ఇంట్లో చేసుకుంటే బాగుంటుందనిపించింది. ఆ విషయమే నిన్నడుగుదామని వచ్చామక్కా."

"ఓసి పిచ్చి చెల్లాయిలూ! ఈ మాత్రందానికి అంత బెరుకెందుకూ! అక్కయ్య ఇల్లంటే మీ ఇల్లు కాదూ!" అంది రుక్మిణి.

"అంతే కాదక్కా! ఈ దీపావళిని 'అంతర్జాతీయ మహిళా దినోత్సవ'ంగా జరుపుకుందామని కోరిక" అంది నాగ్నజితి.

"అదేమిటి ఈ పేరెక్కడా వినలేదే!" అంది రుక్మిణి.

''అదికాదక్కా - ఈ భూమీ్మద ఉజ్జాయింపుగా సగమ్మంది ఆడవాళ్ళమున్నాం. సగమ్మంది మగవాళ్ళున్నారు. అంటే ప్రపంచంలో జరిగే ప్రతి చిన్నా పెద్దా పనిలో మన భాగస్వామ్యం వుంది కదా! కాని పేరు మాత్రం మగవాళ్ళకే వస్తోంది. ఇది న్యాయంగా వుందంటావా!" అడిగింది లక్షణ.

"మీరనుకునేదేమిటో స్పష్టంగా చెప్పండి" అంది రుక్మిణి.

"ఈ భూమీ్మద మగవాళ్ళెన్ని పనులు సాధించారో, ఆడవాళ్ళు కూడా అన్ని పనులూ తాము కూడా చేయగలమని నిరూపించారు. ఇంకా ఎక్కువే చేశారు కూడా!" అంది కాళింది.

"ఆ ఎక్కువేమిటో" చిరునవ్వుతో అడిగింది రుక్మిణి.

"మనం పదినెలలు కష్టపడి మోసి ప్రాణాలకు తెగించి శిశువుల్ని కంటున్నాం. మన కడుపులోంచి బయటపడ్డ మగవాడు మాత్రం మనల్ని అణచివేయాలని చూస్తున్నాడు." అన్నది భద్ర.

"ఇక్కడకు రావడానికి ముందు చర్చ బాగానే జరిగిందన్నమాట. ఇంతకీ అంతర్జాతీయ మహిళా దినోత్సవమంటే ఏమిటో చెప్పలేదు." అంది రుక్మిణి.

"ప్రపంచమంతటా ఉన్న మహిళలందరూ ఏకంకావాలనీ, వారి వారి సమస్యలను వాళ్ళు చర్చించుకొని పరిష్కారాన్ని తమంతతాముగా మహిళలే కనుగొనాలని, పురుషుల కంటే మహిళలు ఏవిధంగానూ తీసిపోరని నిరూపించాలనీ, మా ఆశయం" ఆవేశంతో ఊగిపోతూ చెప్పింది కాళింది.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Krishnarpanam+Srilekha+Sahiti**

* * *